క్లుప్తంగా

అన్నదానానికి నిత్యావసర సరకులు అందజేత



తాతాజీని సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

డాబాగార్డెన్స్: ప్రముఖ సంఘ సేవకుడు, కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ) జన్మదినోత్సవం సందర్భంగా పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో అన్నదానం కోసం బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ వాసులు, సంస్థ మహిళలు తాతాజీని ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం అన్నదాన కార్యక్రమం పేదల కోసం నిర్వహించడం అభినందనీయమని సంస్థను కొనియాడారు. కార్యక్రమంలో వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

విమ్స్ డైరెక్టర్‌కు సత్కారం



విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబును సత్కరిస్తున్న వైద్యేతర సిబ్బంది

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబును గురువారం వైద్యేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఇటీవల రాష్ట్రానికి మొదటిసారి జీవన్‌ధాన్ అవార్డు లభించిన విషయం తెలిసిందే. ఈ నెల 3న న్యూఢిల్లీలో జరిగిన జాతీయ అవయవదాన దినోత్సవంలో రాష్ట్రం తరఫున ఆయన జీవన్‌ధాన్ కో ఆర్డినేటర్ హోదాలో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబును ఇక్కడ వైద్యేతర సిబ్బంది సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. సిబ్బందికి డైరెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

26 మద్యం బాటిళ్ల పట్టివేత

సబ్బవరం: స్థానిక మూడు రోడ్లు కూడలిలో గురువారం సాయంత్రం ఒక వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 26 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. సబ్బవరం మూడు రోడ్లు కూడలిలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా సబ్బవరంలోని సాయినగర్ కాలనీకి చెందిన తాటిపాముల మణికంఠ అనే వ్యక్తిని మద్యంతో అరెస్ట్ చేసినట్టు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ.3.900 వరకూ ఉంటుందన్నారు. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, సిబ్బంది ఆర్‌కే నాయుడు తదితరులు ఉన్నారు.

విమ్స్ మైదానంలో పూల మొక్కలు నాటాలి



విమ్స్ ఓపీ ఎదురుగా పచ్చని ఖాళీ మైదానం

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో పలు చోట్ల ఖాళీ మైదానాలున్నాయి. ఓపీ ఎదురుగా రెండు వైపులా పచ్చని లేన్లతో కూడిన ఖాళీ స్థలాలు, వైద్య పరీక్షల ల్యాబ్ ఎదురుగా పిచ్చి మొక్కలు, పెద్ద ముళ్లచెట్లతో కూడిన విశాలమైన ఖాళీ స్థలంతోపాటు రిహేబిలిటేషన్ సెంటర్ ఎదురుగా విశాలమైన ఖాళీ స్థలం ఉంది. ఓపీ ఎదురుగా ఉండే స్థలాల్లో గతంలో పచ్చని లేన్లు ఏర్పాటు చేసి పలు రకాల అందమైన పూల మొక్కలు నాటారు. ఇవి కొన్నాళ్ల పాటు విమ్స్‌కు వెళ్లే రోగులు, వారి సహాయకులకు ఆహ్లాదాన్ని ఇచ్చేవి. కరోనా మహమ్మారి సమయంలో విమ్స్ కోవిడ్ రోగులతో నిండిపోవడంతో ఇక్కడ పూల మొక్కలకు సంరక్షణ చేసేవారు లేకుండా పోయారు. దీంతో ఈ మొక్కలు కనుమరుగయ్యాయి. అనంతరం అక్కడ పూల మొక్కల గురించి సిబ్బంది మరిచిపోయారు. దీంతో ఈ ఖాళీ స్థలాలు బోసిపోయాయి. వీటిలో సేదదీరడానికి వీలుగా పార్కు తయారు చేసి పూల మొక్కలు నాటించాలని రోగుల సహాయకులు కోరుతున్నారు.

శుద్ధ నీరు అబద్ధం

- ఆర్వో ప్లాంట్ల దందా
- ప్రమాణాలు పాటించని వైనం
- పట్టించుకోని అధికారులు



మహారాణిపేటలోని ఓ ప్లాంట్ వద్ద ఇలా..



అపరిశుభ్ర వాతావరణంలో ఆర్వో ప్లాంట్ వద్ద నీరు పట్టుకుంటున్న మహిళ

డాబాగార్డెన్స్: నగరంలో తాగు నీరు కల్తీ అవుతోంది. అందరూ కాకపోయినా చాలా మంది తాగునీటితోనే ఏటా రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. తాగునీరు పేరిట దందా సాగుతోందని ఆరోపణలు వినిస్తున్నా..జిల్లా యంత్రాంగం చట్టించుకోవడం లేదు. ఆర్వో ప్లాంట్లలో నాణ్యత ప్రమాణాలు పాటించకున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడతున్నారు.

జీవీఎంసీ పరిధిలో కుళాయి నీటిపై ప్రజలకు సదాభిప్రాయం లేదు. దీంతో చాలా మంది వాటర్ క్యాన్ల కొనుగోలుకే మొగ్గు చూపుతున్నారు. గెడ్డలు, మురుగునీటి కాలువల పక్కనే గల మోటార్ల ద్వారా సేకరించిన భూగర్భ జలాలను సక్రమంగా శుద్ధి చేయకుండానే వాటర్ క్యాన్ల ద్వారా విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మంచినీటిలో రుచి కోసం ఆర్వో ప్లాంట్ నిర్వాహకులు రసాయనాలు కలుపుతున్నారని సమాచారం. విశాఖలో ప్రస్తుతం 225 వరకు ఆర్వో ప్లాంట్లు ఉండగా, వీటిలో 120కి పైగా ప్రమాణాలు లేని ప్లాంట్లుగా అధికారులు గుర్తించారు. వీటిలో దక్షిణ నియోజకవర్గ పరిధి మహారాణిపేట, అల్లిపురం, రాంనగర్, బౌడరారోడ్డు తదితర ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లున్నాయి.



క్యాన్ అడుగు భాగాన నల్లటి మట్టి

ప్రమాణాలకు దూరంగా ఆర్వో ప్లాంట్లు

జీవీఎంసీ పరిధిలోని ఆర్వో ప్లాంట్లలో నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చేశారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఏటా వేసవిలో మంచి నీటి క్యాన్లకు అధిక డిమాండ్ ఉంటుంది. భూగర్భ జలాలను ఇష్టానుసారంగా వినియోగిస్తూ, వాటిని సక్రమంగా శుద్ధి చేయడం లేదు. గెడ్డలు, మురుగు కాలువలకు సమీపంలోని బోర్ల నుంచి భూగర్భ జలాలు సేకరించడంతో నీరు కలుషితమవుతోంది. నీటిని సక్రమంగా శుద్ధి చేయకపోవడంతో కోలిఫాం, సూడోమోనాస్, క్లిబ్‌సిల్లా, సాల్మోనెల్లా వంటి బ్యాక్టీరియా కనిపించడం ఆనవాయితీగా మారిపోయింది. ఇటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అటు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఆర్వో ప్లాంట్లను తనిఖీలు చేయడమే మర్చిపోయారు.

కాచి చల్లార్చిన నీరు ఎంతో మేలు

ప్రజలు రోజూ మంచి నీటిని మరిగించి చల్లారిన తరువాత తీసుకోవడం ఎంతో మేలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వాటర్ ప్యూరిఫైయర్స్ కూడా సకాలంలో శుభ్రం చేయకపోయినా..మంచి నీరు కలుషితం అయ్యే ప్రమాదముంది. వాటర్ ప్యూరిఫైయర్స్‌లో రెండు నెలలకు ఒకసారి వాటర్లో ట్యాబ్లెట్ వేసి నీరు ఖాళీ చేయాల్సి ఉంటుంది. ఇక ఫిల్టర్లలో అయితే కాండిల్స్‌ను నిర్ణీత కాలంలో మార్చాల్సి ఉంటుంది. ఇవి సకాలంలో చేయలేమనుకున్నప్పుడు వేడి నీరు చల్లార్చి తాగడం ఉత్తమమని వైద్యులు సూచిస్తున్నారు.

కలుషిత నీటితోనే వ్యాధులు..

ప్రజల అనారోగ్యానికి కలుషిత నీరే కారణమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆర్వో ప్లాంట్లలో ప్రమాణాలు పాటించని కారణంగానే మంచి నీటి క్యాన్లలో బ్యాక్టీరియా వృద్ధి చెందుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా ఆర్వో ప్లాంట్లలో తయారైన నీటిని వాడవద్దని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే హెచ్చరిక జారీ చేసినా..ప్రజల్లో తగినంత అవగాహన లేకపోవడంతో వాటర్ క్యాన్ల డిమాండ్ పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. ఆర్వో ప్లాంట్ నీటి వాడకం కారణంగా దీర్ఘకాలంలో శరీరంలో కాల్షియం కారక సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో క్రియేటివ్ ఈ కంటెంట్



ట్రైనింగ్ క్యాంప్‌లో పాల్గొన్న వివిధ కళాశాలల అధ్యాపకులు



ఆన్‌లైన్లో ట్రైనింగ్ క్యాంప్‌నకు సంబంధించి మాట్లాడుతున్న డాక్టర్ పోలా భాస్కర్

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం క్రియేటివ్ ఈ కంటెంట్ కార్యక్రమం నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజుల తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ డాక్టర్ పోలా భాస్కర్ నోడల్ రీసోర్స్ సెంటర్‌లో గల రికార్డింగ్ స్టూడియోను ఉపయోగించుకుని నాణ్యమైన 'ఈ కంటెంట్'ను తయారు చేయాలని అధ్యాపకులకు సూచించారు. తద్వారా విద్యార్థులు విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మంజుల మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తించేలా పాఠ్యాంశాలను రూపొందించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్స్‌గా డి.అరుణపద్మ, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు డాక్టర్ బి.హైమావతి, భౌతికశాస్త్ర అధ్యాపకురాలు డి.ప్రజ్ఞతో పాటు ట్రైనింగ్ క్యాంప్‌లో వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (చోడవరం, నక్కపల్లి, నర్సీపట్నం, చింతపల్లి)ల నుంచి పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

వాసుపల్లి వెంటే మేమంతా...



వాసుపల్లితో 30వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు

డాబాగార్డెన్స్: అధికారంలో ఉన్నా..లేకపోయినా పార్టీని నడిపించుకుంటూ వాసుపల్లి గణేష్‌కుమార్‌తోనే పని చేస్తామని జీవీఎంసీ 30వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం వాసుపల్లితో పలువురు కార్యకర్తలు సమావేశమయ్యారు. పార్టీపర అంశాలపై చర్చించారు. 30వ వార్డు నుంచి నిజమైన సేవ చేసే వైఎస్సార్ సీపీ శ్రేణులంతా వాసుపల్లి వెంటే ఉన్నామన్నారు. కార్యక్రమంలో దశమంతుల మాణిక్యాలరావు, దశమంతుల చిన్ని, రవితేజ, రాము, దిలీప్, రామలక్ష్మీ, వేణు, గౌస్, సాదబ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై స్పెషల్ డ్రైవ్



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఏఎంహెచ్‌వో

జగదాంబ: వ్యాధులు సీజన్ నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో ఎ.రాజేష్ అన్నారు. గురువారం జోన్ పరిధిలో 12 వార్డుల్లో పర్యటించిన ఆయన పారిశుధ్య సిబ్బందితో మాట్లాడారు. అన్ని వార్డుల్లో ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీధుల్లో , అపార్టుమెంట్‌ల్లో ఫాగింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పారిశుధ్య సిబ్బంది రోజూ ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు తప్పనిసరిగా విధులు నిర్వహించాలన్నారు. ఇందులో ఎవరికి మినహాయింపు లేదన్నారు. ఆ విధంగా చేయని వారిపై చర్యలు తప్పవని ఏఎంహెచ్‌లో హెచ్చరించారు. వార్డు కార్యాలయల్లో రిజిస్టర్‌లు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిశోర్, వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రెటరీలు పాల్గొన్నారు.

ఎంజీఎం హైస్కూల్ అభివృద్ధి కమిటీ ఎన్నిక



నూతన కమిటీతో ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీవీఎస్ నాగభూషణం తదితరులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎస్ఎంసీ కమిటీ

అల్లిపురం: డాబాగార్డెన్స్‌లోని మహాత్మాగాంధీ మున్సిపల్ హై స్కూల్‌లో పాఠశాల కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీవీఎస్ నాగభూషణం కమిటీ కన్వీనర్‌గా ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల్లో కమిటీ చైర్మన్‌గా ఎం.అప్పలరాజు, వైస్ చైర్మన్‌గా కె.మనీషాలను ఎన్నికయ్యారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు నాగభూషణం మాట్లాడుతూ కమిటీ సభ్యులు పాఠశాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నిర్వహణ లో భాగంగా ప్రతి తరగతికి ముగ్గురు చొప్పున 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. వారిలో ఒకరిని చైర్మన్‌గాను, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. వారితో ప్రధానోపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు.

ఎంవీడీ హైస్కూల్లో ఎస్ఎంసీ ఏకగ్రీవం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ దండుబజార్ ఎంవీడీ హైస్కూల్లో గురువారం స్కూల్ మేనేజిమెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.జనార్ధనరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికల్లో పాఠశాల చైర్మన్‌గా పి.అప్పన్న, వైస్ ప్రెసిడెంట్‌గా వి.కుమారితో పాటు మరో 15 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాఠశాల అభివృద్ధి డ్రాపవుట్స్‌ను చేర్పించడం తదితర అంశాలపై తమ సహాయ సహకారాలు అందిస్తామని ప్రమాణ స్వీకారం చేశారు.

ట్రాఫిక్ గందరగోళం



ఆశీలమెట్ట సబ్‌వే మార్గంలో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహన చోదకులు

సీతమ్మధార: మూడు పోలీస్ స్టేషన్ల సరిహద్దుగా గల ఆశీలమెట్ట సబ్‌వే మార్గంలో ట్రాఫిక్ మళ్లీ గందరగోళంగా తయారైందని ఆందోళన వ్యక్తమవుతోంది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి ఆశీలమెట్ట జోన్-3 ఆఫీస్ వరకు ఈ సబ్ వే మార్గం విస్తరించి ఉంది. టూ టౌన్, త్రీ టౌన్, ద్వారకా జోన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఈ సబ్‌వే మార్గంలో మొదట్లో సిటీ బస్సులు రాకపోకలు సాగించేవి. రెండు వైపులా ట్రాఫిక్ అనుమతించేవారు. అప్పట్లో డివైడర్లు ఉండేవి. తరువాత ఎందుకనో వాటిని తొలగించి ఫుట్‌పాత్‌కు తరలించిన తరువాత మూడు ప్రమాదాలు జరిగాయి. ఇవన్నీ ఆర్టీసీ బస్సుల కారణంగానే జరగడం గమనార్హం. ఈ ప్రమాదాల్లో ముగ్గురు వాహన చోదకులు మరణించారు. దీంతో ద్వారకా పోలీసులు ఈ సబ్‌వే మార్గాన్ని వన్‌వేగా మార్చారు. రామాటాకీస్ నుంచి జీవీఎంసీ కార్యాలయం మీదుగా పాత జైలురోడ్డు వైపు మాత్రమే వాహనాలు అనుమతిస్తున్నారు. సిటీ బస్సులను ఆశీలమెట్ట సిగ్నల్స్ వైపు రూటు మార్చారు.

స్తంభిస్తున్న ట్రాఫిక్

రెండు నెలలుగా ఈ సబ్‌వే మార్గంలో ఇరువైపులా మళ్లీ వాహనాలను అనుమతించడంతో ట్రాఫిక్ గందరగోళంగా తయారైంది. ఆశీలమెట్ట జోనల్ కార్యాలయం ఎదుట వాహన చోదకులు యూ టర్న్ తీసుకునే క్రమంలో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోతోంది. ఈ సమయంలో వాహన చోదకులు సహనం నశించి బండి హారన్లు మోగించడంతో ఈ ప్రాంతమంతా శబ్ద కాలుష్యంతో నిండిపోతోందని స్థానికులు హడలి పోతున్నారు. దీంతో ఇక్కడ యూ టర్న్ మూసివేయాలని పలువురు సూచిస్తున్నారు.

వాయువేగంతో ఓవర్‌టేక్

గతంలో పోలీస్ కమిషనర్ మహేష్‌చంద్ర లడ్డా హయాంలో సబ్‌వే మార్గాన్ని పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. కాలక్రమేణా సబ్‌వే మార్గం గురించి పోలీసు ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం వల్లే నిత్యం ట్రాఫిక్ గందరగోళంగా ఉంటోందని పలువురు అంటున్నారు. వాస్తవానికి ఈ మార్గంలో వాహనాలు తమ ముందు వాహనాన్ని ఓవర్‌టేక్ చేయకూడదు. ఈ నిబంధనను మీరి పలువురు యువకులు ఇష్టానుసారంగా వాయువేగంతో దూసుకెళ్తున్నారు. లైన్ క్రాస్ చేసి మరీ ముందు వాహనాలను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న వాహన చోదకులను హడలెత్తిస్తున్నారు. ఇక్కడ సిమెంట్ డివైడర్లకు బదులుగా ప్లాస్టిక్ స్టిక్స్ మాత్రమే వాడటం విమర్శలకు తావిస్తోంది. డివైడర్లు రోడ్డు పొడుగునా కాకుండా సబ్‌వే మధ్యలో మాత్రమే ఏర్పాటు చేయడం గమనార్హం. త్రీటౌన్, ద్వారకా, త్రీ టౌన్ ట్రాఫిక్ పోలీసులు స్పందించి సబ్‌వే మార్గంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

విశేషంగా శ్రావణలక్ష్మి పూజలు



పంచామృతాభిషేక సేవలో సిరులతల్లి



అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు



విశేష హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు గురువారం నాల్గో రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రావణలక్ష్మి పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కార్యనిర్వహణాధికారి శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా పంచామృతాభిషేక సేవలో 26 మంది ఉభయదాతలు, కుంకుమ పూజలో పలువురు మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి వెంపలి రాంబాబు ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

తొలి శుక్రవారం పూజలకు ఏర్పాట్లు

శ్రావణమాసం తొలి శుక్రవారం పూజలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలచే భక్తులు (దంపతులు)రూ.400 టికెట్ రుసుం చెల్లించాలి. పూజ అనంతరం భక్తులకు శేషవస్త్రంగా కండువా, జాకెట్టు ముక్క, పులిహోర, చక్కర పొంగలి, శ్రీచక్రయంత్రం(రాగి)ని మహాప్రసాదంగా అందజేయనున్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం పురస్కరించుకొని ఉదయం 5 నుంచి 7 గంటల వరకు అమ్మవారి మూల విరాటకు క్షీరాభిషేకం నిర్వహించనున్నారు. 8 గంటలకు అమ్మవారిని ముత్యాల చీరతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. 10 గంటల నుంచి మహిళలచే సామూహిక లలితా సహస్రనామ పారాయణం, 10.30 గంటలకు 200 మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు.

జేసీఐ అచీవర్స్ అధ్యక్షుడు దిలీప్‌కు సెనేటర్ అవార్డు



దిలీప్‌కు అవార్డు అందజేస్తున్న రికేష్ శర్మ

డాబాగార్డెన్స్: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఇండియా విశాఖ జోన్ వైజాగ్ అచీవర్స్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్న దిలీప్‌కు యూఎస్ సెనేటర్ అవార్డు లభించింది,. జేసీఐ నిర్వహించే పలు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడమే గాక నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్న దిలీప్ సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డును విశాఖ పర్యటనకు విచ్చేసిన జేసీఐ జాతీయ అధ్యక్షుడు రికేష్ శర్మ చేతుల మీదుగా గురువారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో దిలీప్‌కు అందజేశారు. దిలీప్‌కు లభించిన అవార్డు పట్ల పలువురు జేసీఐ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సురేష్ గొంప, కేవీ రావు, శీతల్‌మదన్, ఉమ, సాయి, సుదీర్, వంశీ, నర్సింహమూర్తి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మక్కా వెళ్లే మహిళకు వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గం 39వ వార్డుకు చెందిన షేక్ మహబూబ్ బేగం మక్కా వెళ్లేందుకు ఖర్చుల నిమిత్తం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. సౌదీ ఆరేబియాలో ఉన్న మక్కాలో ఉమ్రా చేయడానికి వెళ్తున్న ఆమె ఆశీల్‌మెట్ట అశోక్ నగర్‌లోని కార్యాలయంలో వాసుపల్లిని కలిశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ చిన్నతనం నుంచి పుట్టి పెరిగిన పాతపట్టణం ప్రాంతంలో ముస్లింలతో విడదీయరాని బంధం ఉందన్నారు. 70 ఏళ్ల వయస్సులో అల్లా ప్రార్థన కోసం వెళ్తున్న షేక్ మహబూబ్ బేగం ప్రయాణం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ దక్షిణ నియోజకవర్గ మైనార్టీ నాయకుడు ముజీబ్‌ఖాన్, షకీల్, అనీజ్, లేకత్, చిన్ని, గనగళ్ల రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీవీఎంసీ కొత్త రాగం



ఫుట్‌పాత్ వ్యాపారాలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ అధికారులు



వ్యాపారిని హెచ్చరిస్తున్న ట్రాఫిక్ పోలీసు



ప్లకార్డులతో జీవీఎంసీ ఉద్యోగులు ప్రచారం

డాబాగార్డెన్స్: ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై జీవీఎంసీ కొత్త రాగం పలికింది. ఫుట్‌పాత్‌లు ఆక్రమించవద్దు..ప్రజలకు అసౌకర్యం కల్గించవద్దు. జీవీఎంసీ ఫుట్‌పాత్‌లు ఆక్రమించకూడదు..వెంటనే స్వచ్ఛందంగా తొలగించండి. లేదంటే మేమే తొలగిస్తామంటూ.. పలువురు మహిళా ఉద్యోగులతో జీవీఎంసీ కొత్త రాగానికి తెరలేపింది. జగదాంబ లేపాక్షి జంక్షన్ నుంచి పాతనగరం రాణిబొమ్మ వరకు 60 అడుగుల రోడ్డుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రోడ్డు విస్తరణ పనులు 90 శాతం మేర పూర్తయ్యాయి. లేపాక్షి జంక్షన్ నుంచి పూర్ణామార్కెట్ వరకు విస్తరణ పనులతో పాటు నూతన రోడ్డును వేశారు. పూర్ణామార్కెట్ నుంచి పాతనగరం రాణిబొమ్మ వరకు రోడ్డు పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో ఆ పనులు కూడా జరగడం లేదు. ఇదిలా ఉండగా..లేపాక్షి జంక్షన్ నుంచి పూర్ణామార్కెట్ వరకు రోడ్డు కిరువైపులా జీవీఎంసీ ఇటీవలే ఫుట్‌పాత్‌ను ఆధునీకరించింది. ఫుట్‌పాత్‌లపైన..ఫుట్‌పాత్ కిందన రొడ్డుకిరువైపులా పలువురు తోపుడు బళ్ల కార్మికులు చిరు వ్యాపారాలు సాగిస్తున్నారు. గురువారం పలువురు జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగ సిబ్బంది ఫుట్‌పాత్ ఆక్రమణలు వెంటనే తొలగించాలంటూ ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టారు. ట్రాఫిక్ పోలీసుల సహకారంతో పలువురు పట్టణ ప్రణాళికా విభాగ సిబ్బంది ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలని.. లేదంటే మేమే తొలగిస్తామని హుకుం జారీ చేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం లక్ష విరాళాన్ని నగరంలోని శాంతిపురానికి చెందిన చిన్మయి నంద సాహిత్య అనే దాత అందజేశారు. సింహగిరికి కుటుంబ సమేతంగా వచ్చిన దాత సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావుకు అందజేశారు. దాతకు స్వామివారి దర్శనం కల్పించారు.